56 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - మోతుగూడెం : డొంకరాయి మీదుగా చింతూరు వైపునకు తరలుతున్న 56 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. వారి కథనం ప్రకారం.. గంజాయి తరలుతున్న విషయం తెలుసుకుని మోతుగూడెం పోలీస్ స్టేషన్ ఎదురుగా గల చెక్‌పోస్టు వద్ద శనివారం వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. అటుగా వెళ్తున్న వాహనాన్ని ఆపగా ఇద్దరు వ్యక్తులు దిగి పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని వెంబడించి పోలీసులు పట్టుకున్నారు. ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలుతున్నట్టు గుర్తించారు. వారి నుంచి లభ్యమైన సరుకు విలువ రూ.2 లక్షలా 80 వేలు ఉంటుందని తెలిపారు. నిందితుల్లోని సాహిన్ యూసఫ్ ఖాన్, హనన్ మహమ్మద్ అలీ మహారాష్ట్రకు చెందినవారు. కేసు దర్యాప్తులో ఉంది. గంజాయి పట్టివేతలో ఎస్ఐ నారాయణ, రాజేశ్వరరావు, పురుషోత్తం, సుబ్బారావు, సన్యాసిరావు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతం

ఏకగ్రీవాలే అధికం

జిల్లాలోని పాడేరు, రంపచోడవరం ఏజెన్సీల్లో సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా సాగాయి. అత్యధిక చోట్ల అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రజాశక్తి-పాడేరు

సాగు నీటి సంఘం ఎన్నికలు సజావుగా జరిగాయని ఎన్నికల అధికారి కె.శ్రీనివాస్ నాయుడు తెలిపారు. తుంపాడ నీటి సంఘం పరిధిలో ఆరు టెరిటోరియల్ కాన్షియన్సీ ఉన్నాయని అన్నారు. శనివారం తుంపాడ నీటి సాగునీటి సంఘం ఎన్నికలు సచివాలయంలో టేరిటోరియల్ కాన్షియన్సీ వారీగా ఎన్నికలు నిర్వహించడం జరిగిందని చెప్పారు. ఒకటో టెరిటోరియల్ కాన్షియన్సీకి ముడువ కళ్యాణ్ కుమార్, రెండుకు గుడుసా సూర్యనారాయణ, మూడుకు ముడువ మోహన్ బాబు, నాలుగుకు ముడువ లక్ష్మీ కొండమ్మ, ఐదుకు డూరు అచ్చుమ్మ, ఆరుకు డూరు వెంకటరమణ ఎన్నికయ్యారని పేర్కొన్నారు. వారిలో డూరు వెంకటరమణ అధ్యక్షునిగా, ముడువ కళ్యాణ్ కుమార్ ఉపాధ్యక్షునిగా ఎన్నికైనట్టు ప్రకటించారు. ఈ మేరకు ఎన్నికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. పాడేరు తహశీల్దార్ వి.త్రినాధరావు నాయుడు, ఎస్ఎంఎస్ డిఇఆర్. నాగేశ్వరరావు ఎన్నిక ప్రక్రియను పర్యవేక్షించారు.

జిల్లా వ్యాప్తంగా 86 సంఘాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా 80 సాగునీటి సంఘాలకు ఎన్నికల జరిగాయి. 4 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఎన్నికల జరిగిన సాగునీటి సంఘాలలో అధ్యక్షులు ఉపాధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని డిఇఆర్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిసిసి డైరెక్టర్ బొర్రా నాగరాజు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చెక్కలమద్ది నీటి సంఘం అధ్యక్షునిగా బరసయ్య

సీలేరు: జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ చెక్కల మద్ది పంచాయతీ నీటి సంఘం ఎన్నికలో అధ్యక్షునిగా గొర్లె బరసయ్య, ఉపాధ్యక్షులుగా గొర్లె రామయ్య ఎన్నికయ్యారని ఎన్నికల అధికారులు జీకే వీధి అగ్రికల్చర్ అధికారి మధుసూదనరావు, ఇఒపిఆర్‌డి పాపారావు వెల్లడించారు. గుమ్మరేవుల పంచాయతీలో అధ్యక్షులుగా మురళీ నీలేంద్రం, ఉపాధ్యక్షులుగా గోపాలకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. ఎన్నికైన వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ జుర్ర దేవమణి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రమేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజేష్ మహిళా పోలీస్ పద్మ పూజారి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని గుంటగన్నెల సాగునీటి సంఘం ఎన్నికలు సజావుగా జరిగాయి. ఎన్నికల అధికారిగా అజయ్ కుమార్ వ్యవహరించారు. సాగునీటి పరిధి గ్రామాల గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సంఘం అధ్యక్షుడిగా వంతల గురు, ఉపాధ్యక్షునిగా గొల్లూరి హరితో పాటు మరో పది మంది డైరెక్టర్లను ఎన్నుకున్నారు. టిడిపి మండల అధ్యక్షుడు టీ.సుబ్బారావు, టిఎన్‌టియుసి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి స్వామి, కూటమి నాయకులు విశ్వనాథం, కామేష్, చినగెన్ను తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని సాగు నీటి సంఘం ఎన్నికలు అధికారుల సమక్షంలో జరిగాయి. గుమ్మకోటలో జరిగిన ఎన్నికల్లో వైసిపి మద్దతుదారులు గెలిచారు. అధ్యక్షునిగా గుండ,



నియామక పత్రం అందుకుంటున్న సత్యసుందరరావు

ఉపాధ్యక్షులుగా అంటిపర్తి. పెంటయ్య, రామకృష్ణతో పాటు నలుగురు డైరెక్టర్ సభ్యులుగా ఎన్నికయ్యారు.

భీంపోలు ఉపాధ్యక్షునిగా ఎన్నికైన జేష్ట వెంకటరమణ

భీంపోలు పంచాయతీలో వైసిపి మద్దతుదారు తగాశెట్టి .వెంకటరమణ అధ్యక్షులుగా, సిపిఎం మద్దతుదారు జేష్ట వెంకటరమణ ఉపాధ్యక్షునిగా ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా ముగ్గురు టిడిపి మద్దతుదారులు, ఇద్దరు వైసిపి మద్దతుదారులు ఎన్నికయ్యారు.

జి.మాడుగుల : మండలంలోని కె.కోడాపల్లి గ్రామ పంచాయతీ బందవీధిలో తాబేలు గుమ్మి ఆయ కట్టు సాగునీటి సంఘం ఎన్నికలు జరిగాయి. ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, టీసీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో ప్రెసిడెంట్‌గా పలసి పెంటయ్య, వైస్ ప్రెసిడెంట్‌గా కొండపల్లి పిన్నయ్య, టీసీలుగా పలసీ. నూకరాజు, పలాసి. పిన్నయ్యా దొర, ఉల్లి కామేశ్వరరావు, మట్టం శ్రీహరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రాజవొమ్మంగి : మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా సాగాయి. టిడిపి మద్దతుదారులు ఎక్కువచోట్ల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సింగంపల్లి చెరువు అధ్యక్షులుగా కేలేల సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా సింగిరెడ్డి సత్యనారాయణ, జడ్డంగి పాలకాలువ అధ్యక్షులుగా బారంగి సూర్యప్రకాశరావు, ఉపాధ్యక్షులుగా చిట్రా నూకరాజు, జడ్డంగి మడేరు ఆనకట్ట అధ్యక్షులుగా కాళ్లకూరి సత్య సుందరరావు, ఉపాధ్యక్షులుగా ఆవాల చంద్రరావు., కొండలింగంపర్తి అధ్యక్షులుగా గడుతూరి ముసలి, ఉపాధ్యక్షులుగా దూరిపల్లి వసంత కుమారి, ఉర్లాకులపాడు అధ్యక్షులుగా కోసూరి సోమరాజు, ఉపాధ్యక్షులుగా జర్తా రమణ, వట్టిగెడ్డ రిజర్వాయర్ అధ్యక్షులుగా కొసిరెడ్డి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా పాపాని శివసత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వారికి టిడిపి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొల్లపూడి పెద్దిరాజు, ముప్పన డింబకేశ్వరరావు, గణజాల తాతారావు, దంతులూరి శివరామ చంద్రరాజు అభినందనలు తెలిపారు.

జి.మాడుగులలో...

పాడేరులో...



డిప్యూటేషన్ల పేరిట సుదూర ప్రాంతాలకు పంపొద్దు

ఐటిడిఎ ఎదుట యుటిఎఫ్ నాయకుల నిరాహార దీక్ష

నిరాహార దీక్ష చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - రంపచోడవరం : ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న రెగ్యులర్ ఉపాధ్యాయులను, సిఆర్‌టిలను డిప్యూటేషన్ల పేరుతో సుదూర ప్రాంతాలైన అనంతపురం, నెల్లూరు, గుంటూరులకు పంపడాన్ని ఖండిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన రంపచోడవరం ఐటిడిఎ కార్యాలయం ఎదుట శనివారం నిరాహార దీక్ష నిర్వహించారు. సంఘం నాయులు కె.ఆదిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను సంస్కరిస్తామని చెబుతూనే గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను శ్రమ దోపిడీ చేస్తోందన్నారు. వెట్టిచాకిరీ చేయిస్తూ కనీస వేతనం చెల్లించకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రంపచోడవరం గిరిజన ప్రాంతంలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను, సిఆర్‌టిలను వందల కిలోమీటర్ల మేర డిప్యూటేషన్ల కింద వేయడం తగదన్నారు. గురుకుల ఉపాధ్యాయుల సమ్మెను అణగదొక్కడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. సంఘం ఐటిడిఎ సబ్ కమిటీ కన్వీనర్ కె.ఆదిరెడ్డి మాట్లాడుతూ అంతంత దూరం డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయులు, సిఆర్‌టిలు అక్కడ సరైన వసతి సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ఆదివాసీ గిరిజన సంఘం మద్దతు

దీక్షకు ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు మద్దతు తెలిపారు. డిప్యూటేషన్ల విధానంపై మండిపడ్డారు. గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కొన్ని రోజులుగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పోరాటం చేస్తున్నా పట్టదా ? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సిరిమల్లె రెడ్డి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.రమేష్ బాబు, రంపచోడవరం మండల అధ్యక్షులు సనాతన బాబు, గంగవరం మండల ప్రధాన కార్యదర్శి సిహెచ్.రాంబాబు దొర, దేవీపట్నం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, చిన్నిబాబు, రాజవొమ్మంగి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుబ్బారావు, శ్రీను, మారేడుమిల్లి మండల ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, అడ్డతీగల మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుంజం శ్రీనివాస్, రాఘవులు, పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన సంఘం నాయకులు పాల్గొన్నారు.

వ్యాన్ బోల్తా పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చింతూరు : పండ్ల వ్యాన్ బోల్తా పడి వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం తెల్లవారుజామున కుంట రోడ్డులోని వీరాపురం దగ్గర చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పండ్ల లోడుతో రాజమండ్రి నుంచి కుంటకు ఓ వ్యాన్ వెళ్తోంది. తెల్లవారుజాము నాలుగు గంటల సమయంలో వీరాపురం దగ్గర అదుపుతప్పి పల్టీకొట్టింది. వ్యాన్‌లో ఉన్న కామశెట్టి చంద్రరావు (75) తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. డ్రైవర్‌కు, మృతుని భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. కేసు దర్యాప్తులో ఉంది.

సీలేరు గజగజ



సీలేరు బజారు సెంటర్లో కురుస్తున్న మంచు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో శనివారం చలి గజగజ లాడించింది. వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని మంచు తీవ్రత అధికమైంది. శనివారం తెల్లవారుజామున 3 నుంచి ఉదయం 9 గంటల వరకు మంచు విపరీతంగా కురుస్తూ సీలేరు మార్కెట్, ఎపి జెన్‌కో కాలనీ, జెన్‌కో మెయిన్ డామ్ కనిపించలేదు. చలి తీవ్రతకు తట్టుకోలేక ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. రోజూ వెళ్లే వాకర్స్ చలి తీవ్రతకు తట్టుకోలేక అవస్థలకు గురయ్యారు. రెండు మూడు వారాలుగా చలి అంతంతమాత్రంగా ఉన్నప్పటికీ శనివారం తీవ్రత పెరిగింది. వృద్ధులు, చిన్నారులు, ఆస్మా రోగులు చల్లటి గాలులకు తాళలేక ఉక్కిరిబిక్కిరయ్యారు. మంచు తీవ్రత అధికంగా ఉండడంతో ఆంధ్ర ఒడిశా సరిహద్దు నుంచి వచ్చిపోయే వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణించారు. వ్యాపారులు 9 గంటల వరకు దుకాణాలు తెరవలేకపోయారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు ఉదయించే సూర్యుడు 9 గంటల వరకు శనివారం కానరాలేదు. 9.30 గంటలకు భానుడు కనిపించాడు.

చలి తీవ్రతకు తాళలేక చలి మంటలు కాగుతున్న వాకర్స్

6 రోజులు పని కల్పించాలి

ఎపి జెన్‌కో ఈఈ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న లక్ష్మణ్, విష్ణుకుమార్ తదితరులు

ప్రజాశక్తి -సీలేరు: సీలేరులో ఎపి జెన్‌కో (ఒ అండ్ ఎం) సివిల్ డివిజన్‌లో పనిచేస్తున్న 6 గురు కాంట్రాక్టు కార్మికులకు నెలకు 26 రోజులు పనిదినాలు కల్పించాలని కోరుతూ ఎపి జెన్‌కో ఈఈ సివిల్ శ్రీనివాసరెడ్డికి యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు బి.లక్ష్మణ్, విష్ణుకుమార్ శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ, సీలేరు ఎపి జెన్‌కో కాలనీ పరిధిలో ఉన్న చెత్తాచెదారాలు తొలగించి దూర ప్రాంతానికి తరలించడానికి గుత్తేదారునికి 2024- 25 పనులు అప్పగించారని తెలిపారు. కాంట్రాక్టు లెస్‌కు టెండర్ వేయడంతో కాంట్రాక్ట్ కార్మికులకు నెలకి ఆరు రోజులు మాత్రమే పనిదినాలు కల్పిస్తూ ఒక రోజుకు రూ.350 మాత్రమే ఒక్కొక్క కార్మికనికి చెల్లిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నెలలో 26 రోజులు పని దినాలు కల్పించకపోవడంతో పీస్ వర్కర్లకు కుటుంబ పోషణ జరగక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 2025- 26 ఎపి జెన్‌కో శానిటేషన్ పనులకు టెండర్లు పిలిచినప్పుడు కాంట్రాక్ట్ కార్మికులకు ఎటువంటి జీతం కోత విధించకుండా సమాన పనికి సమాన వేతనం కల్పిస్తూ 26 రోజులు పని దినాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సీలేరులో ప్రస్తుతం 41 మంది విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు సివిల్ (ఒ అండ్ ఎం) విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. భవ్య హెల్త్ క్లినిక్ ఆధ్వర్యాన నడుపుతున్న ఎపి జెన్‌కో ఆసుపత్రిలో ఎటువంటి వైద్య సేవలు అందడం లేదని విచారం వ్యక్తం చేశారు. చాలీచాలని జీతాలతో కాంట్రాక్టు కార్మిక కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నాయని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులందరికీ ఎపి జెన్‌కో ఆసుపత్రిలోనే వైద్య సేవలు అందించాలని కోరారు. కాంట్రాక్టు కార్మికుల సర్వీస్ ప్రాతిపదికన తీసుకొని సెమీస్కిల్డ్, స్కిల్డ్, హైస్కిల్డ్ గా ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. 2022 నవంబర్ 14 ప్రకారం ఎపి జెన్‌కో ఉద్యోగులకు కేటాయించిన ఇళ్లను ఇవ్వగా మిగిలిన వాటిని బతికిన కాంట్రాక్టు కార్మికులకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు గౌరవాధ్యక్షులు ఎస్‌కె.సుభాన్, కాంట్రాక్టు కార్మికులు జి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు కీలకం

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలోని ప్రతి గ్రామంలో, ప్రతి ఇంటిలో విద్యుత్ పొదుపు ఆవశ్యకతను గుర్తించి, అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ మెలగాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం అన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయం నుంచి ఏడు మండలాలకు సంబంధించిన ఎపిఇపిడిసిఎల్ ఇంజినీర్లతో, లైన్‌మ్యాన్లతో, కార్యాలయ సిబ్బందితో విద్యుత్ పొదుపు వారోత్సవాల విషయమై మాట్లాడారు. రంపచోడవరంలో ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీలో ఈ నెల 14 నుంచి 20 వరకూ విద్యుత్ పొదుపు వారోత్సవాలు ఉంటాయన్నారు. విద్యుత్ బిల్లు తక్కువ రావాలంటే ప్రతి ఇంట్లో ఎల్ఇడి బల్బులు వాడాలన్నారు. విద్యుత్తు ఆదాతో కలిసి వచ్చే ఖర్చులు చాలావరకు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా తలపెట్టిన ర్యాలీ పిఒ క్యాంపు కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకూ సాగింది. అక్కడ మానవహారం చేపట్టారు. విద్యుత్ పొదుపుపై ఎపిఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.గాబ్రియల్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు మల్లికార్జునరావు, దివాకర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు దొరబాబు, లైన్‌మ్యాన్లు, కార్యాలయ సిబ్బంది, శ్రీనివాసరావు, పి.రాజు, సోమరాజు, శ్రీనివాసులు, బాపిరాజు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఇందన పొదుపు ర్యాలీ ..

చింతూరు : జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా చింతూరులో విద్యుత్ శాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. 33 కెవి సబ్ స్టేషన్ నుంచి చింతూరు మెయిన్ సెంటర్ రాజీవ్ కూడలి వరకు ఈ ర్యాలీ సాగింది. ప్రతి ఒక్కరూ ఇంధనాన్ని పొదుపు చేయాలని నినదించారు. కార్యక్రమంలో ఎడిఇ సుధీర్ బాబు, ఎఇ శ్రీనివాస్, జెఇలు పరశురాం, సతీష్, రాజ్‌కపూర్, ఎల్ఐ గణేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

26 నుంచి వాలంటీర్ల రిలే దీక్షలు

మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి-పాడేరు: ఏజెన్సీలోని మండల కేంద్రాల్లో ఈ నెల 26, 27, 28తేదీలలోగ్రామ వాలంటీర్ల సామూహిక రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు వాలంటీర్ల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు, బోనంగి చిన్నయ్య పడాల్, జిల్లా వాలంటీర్ల సంఘం అధ్యక్ష కార్యదర్శులు, కొండబాబు, ప్రసాద్ తెలిపారు. శనివారం పాడేరు సిఐటియు కార్యాలయం లో సురేష్ అధ్యక్షతన జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బకాయి పడ్డ 7 నెలల వేతనాలతో పాటు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ ప్రకారం రూ. 10000 వేతనంతో గ్రామ వాలంటీర్లను విధుల్లో తీసుకుంటామని ఇచ్చిన హామీ కూటమి ప్రభుత్వ నిలబెట్టుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. సుమారు రాష్ట్రంలో రెండు లక్షల 60 వేల మంది కుటుం బాలతో రోడ్డు మీద పడ్డామని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని మండలాల్లో ఉన్న గ్రామ వాలంటీర్లు ఈ పోరాటానికి సంసిద్ధం కావాలని కోరారు. 26న అన్ని మండలాలలో రిలే నిరాహార దీక్షలు, 27న బిక్షటన, 28న మండల తహసిల్దార్ కార్యాలయాలకు వినతి పత్రాలు ఇవ్వాలని జిల్లా కమిటీ తీర్మానం చేసిందని పేర్కొన్నారు. అన్ని ప్రతిపక్ష పార్టీలు, అన్ని సంఘాలు తమ పోరాటానికి మద్దతు పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, ఉమామహేశ్వరరావు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

పెయింటింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి-అరకులోయరూరల్ : అరకులోయ తేజవళి పెయింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏషియన్ పెయింట్స్ కంపెనీ సహకారంతో స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో యువతకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో వివిధ రకాల పెయింటింగ్స్, పుట్టి, రోయల్ ప్లే ఎనామెల్స్ పెయింటింగ్, డెకరేటివ్ కోటింగ్ వంటి వాటిపై శిక్షణ అందించారు. శిక్షణ పొందిన అనంతరం పెయింటర్స్ కు సర్టిఫికెట్స్, గుర్తింపు కార్డులు, టీ షర్ట్స్, బ్యాగ్స్ టోపీలు అందజేశారు. ఇలాంటి అవకాశాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో తేజవల్లి పెయింటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి.కొండలరావు,సెక్రటరీ సునీల్, కెసిఆర్ గోపి, సభ్యులు కె.మహేష్, జి భీమరాజు, దాసు, శేఖర్, రాజా, సుధాకర్, భవాని శంకర్, రాజేంద్ర, మధు, సుకుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన చట్టాలను ఉల్లంఘిస్తే ఉపేక్షించం

ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

ప్రజాశక్తి- అరకు లోయ: గిరిజన చట్టాలు,హక్కులు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం గిరిజనేతర వర్తకులకు హెచ్చరించారు. శనివారం అరకులోయ వర్తక సంఘం సభ్యులతో స్థానిక అక్షయిన్ లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం ఉందన్న విషయం దృష్టిలో పెట్టుకొని గిరిజనేతరులు ఉండాలని ఆయన అన్నారు. కొంతమంది గిరిజన నేతరులు గిరిజన అమ్మాయిలను పెళ్లి చేసుకొని వారి పేరుతో కోట్ల రూపాయలు అర్జిస్తామంటే కుదరదని ఆయన స్పష్టం చేశారు. తాము

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్య లింగం

వ్యాపారస్తుల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నట్లు కొంతమంది అబండాలు వేస్తున్నారని అది వారికే మంచిది కాదని ఆయన హెచ్చరించారు. ఒకరి వద్ద నుంచి డబ్బులు వసూలు చేయవలసిన అవసరం తమకు లేదని ఆయన స్పష్టం చేశారు. తనపై గాని, తన పిల్లలపై గాని లేనిపోని అబండాలు వేసి పోస్టులు పెట్టి బురదజల్లే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. అరకులోయ పర్యాటక కేంద్రం కావడంతో ఫుట్ పాత్ లపై ఎవరు కూడా వ్యాపారం చేసుకోవడానికి వీల్లేదన్నారు. అరకులోయలో వర్తక సంఘం కార్యవర్గం ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. శ్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు అయిందని పనులు కూడా త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్ష కార్యదర్శులు కృష్ణారావు, పెద్ద సాంబయ్య, సీనియర్ పాత్రికేయుడు ఎల్.బి.వెంకటేశ్వరరావు, వర్తక సంఘం గౌరవ అధ్యక్షుడు బేత రాజారావు, వర్తక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అభిమానులకు అభివాదం చేస్తున్న శ్రీలీల

ఘనంగా చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభం

- సినీ తార శ్రీలీల సందడి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలోని ప్రముఖ వాణిజ్య కేంద్రం డాబా గార్డెన్స్‌లో చెన్నయ్ షాపింగ్ మాల్‌ను ప్రముఖ సినీ తార శ్రీ లీల సందడి వాతావరణం నడుమ ప్రారంభించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ కొత్తగా షాపింగ్ మాల్స్ ఏర్పాటు కావడం వల్ల యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. షాపింగ్ మాల్స్, పరిశ్రమలు రాష్ట్రంలో ఎన్నో రావలసి ఉందన్నారు. ఇటువంటివి ఏర్పాటు కావడానికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, అది తమ పాలసీ అని చెప్పారు. ఇటువంటివి నిర్వహించుకోవడానికి ఎటువంటి అవరోధాలూ లేకుండా చూస్తామని, వ్యాపార సంస్థలను ఇబ్బందులకు గురి చేసేది లేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ అధునాతన కలెక్షన్లతో, ప్రజలందరినీ ఆకర్షించే విధంగా చెన్నయ్ షాపింగ్ మాల్‌ను ప్రారంభించడం హర్షించదగిన విషయమన్నారు. సినీ తార శ్రీలీల మాట్లాడుతూ అన్ని తరగతుల ప్రజల అభిరుచికి తగ్గట్టుగా వస్త్రాలు అందిస్తున్న చెన్నయ్ షాపింగ్ మాల్‌లో అందరికీ అందుబాటు ధరలలో వస్త్రాలు లభిస్తాయని చెప్పారు. కంచి, ధర్మవరం పట్టు వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విశాఖ వంటి ప్రశాంత నగరంలో చెన్నయ్ షాపింగ్ మాల్ ఏర్పాటు కావడం, దానిని తన చేతుల మీదుగా ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో షాపింగ్ మాల్ మేనేజింగ్ డైరెక్టర్ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం షాపింగ్ మాల్ వెలుపల ఏర్పాటు చేసిన వేదికపైకి సినీ తార శ్రీలీల వచ్చి కొంతసేపు సందడి చేశారు. పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావడంతో డాబా గార్డెన్స్ మెయిన్ రోడ్డు కిక్కిరిసిపోయింది. ట్రాఫిక్‌ను వివిధ మార్గాల వైపు పోలీసులు మళ్లించారు.

పర్యాటక కేంద్రాలు కిటకిట

ప్రజాశక్తి-అనంతగిరి : ప్రముఖ పర్యాటక కేంద్రాలు శనివారం కిటికిటలాడాయి. బొర్రా గుహలకు అధికంగా పర్యాటకులు తరలివచ్చారు. దీంతో, ఘాట్ రోడ్ వాహనాలతో ట్రాఫిక్ అంతరాయం నెలకొంది. శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో పర్యాటకులు పిల్ల పాపలతో తరలి వెళ్లారు. బొర్రా గుహలు, కటికి, తాడిగుడ జలపాతాలను సందర్శించి స్నానాలు ఆచరించారు. డమ్ముకు, సుంకరమెట్ట యు పాయింట్‌లలో సెల్ఫీలు దిగారు. కాఫీ ప్లాంటేషన్‌లో కాఫీ పొడి ఇతర వస్తువులను కొనుగోలు చేశారు. శివలింగపురం, తైడా, డమ్ముకు, అనంతగిరి మీదుగా బిసుపురం-సుంకరమట్ట మలుపులతో గంటల తరబడి వాహనాలు నిలిచిపోయాయి

విద్యార్థిని మృతిపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి -పాడేరు: తాటిపర్తి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ముర్ల సత్యవతి అనే విద్యార్థిని మరణం పై సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్, అధ్యక్షులు కృష్ణారావు డిమాండ్ చేశారు. శనివారం పాడేరు ఐటిడిఏ గేటు వద్ద ధర్నా నిర్వహించారు. మృతి చెందిన విద్యార్థినీ కుటుంబానికి ఉద్యోగం, 10 లక్షలు ఎక్స్ గ్రేసియా అందించాలన్నారు. స్టూడెంట్స్ చనిపోవడానికి కారణం ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపమని అన్నారు. విద్యార్థులు చనిపోతున్నా ఇప్పటి వరకు కమిటీ వేసి విచారణ చేయకపోవడం చాలా భాధకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగదీశ్, వాసు, అమోస్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యత ఏదీ ?

రూ.కోట్ల రాయితీలు పొందుతున్న పరిశ్రమాధిపతులు
సిఎస్ఆర్ కింద నిధులు ఇవ్వడానికి మీనమేషాలు
జోక్యం చేసుకోని జిల్లా స్థాయి కమిటీ
పర్యవేక్షణ నామమాత్రం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

తక్కువ ధరకు భూములు, వివిధ రూపాల్లో రూ.కోట్ల విలువైన పన్ను రాయితీలు, మినహాయింపులు, ప్రోత్సాహకాలు పొందుతూ లాభాలు ఆర్జిస్తున్న పరిశ్రమలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కింద నిధులు కేటాయించడానికి మీనమేషాలు లెక్కిస్తున్నాయి. ఆ నిధుల వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన, కలెక్టర్ ఛైర్మన్‌గా ఉన్న జిల్లా స్థాయి కమిటీ చురుగ్గా పనిచేయడం లేదు. దీంతో పరిశ్రమలు ఇష్టాఇష్టాలు, ప్రయోజనాలు ఆధారంగా నిధులిస్తున్నాయి తప్ప నిబంధనల ప్రకారం కేటాయించడంలేదు. పరిశ్రమ ప్రభావిత, పరిసర ప్రాంతాల్లో తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి సిఎస్ఆర్ నిధులు కేటాయింపు కంటే ప్రజా ప్రతినిధుల నుంచి సమస్యలు రాకుండా వారికి ఆర్థిక లబ్ధి కలిగించి, మెప్పుపొందే పనులకు పరిశ్రమాధిపతులు సిఎస్ఆర్ నిధులు కేటాయించి చేతులు దులుపుకుంటున్నారు. ఇది స్థానిక ప్రజాప్రతినిధులకు ఆదాయ వనరుగా మారింది. జిల్లా స్థాయి కమిటీ చురుగ్గా వ్యవహరించకపోవడంతో సిఎస్ఆర్ నిధుల కేటాయింపును తమ బాధ్యతగా పరిశ్రమాధిపతులు భావించడంలేదు.

సిఎస్ఆర్ కింద కేటాయించాల్సిన నిధులు, కేటాయిస్తున్న నిధులు సమాచారం కూడా ఈ కమిటీ వద్ద సరిగా లేదు. సిఎస్ఆర్ నిబంధనల ప్రకారం మూడేళ్లను పరిగణనలోకి తీసుకొని సగటు నికర ఆదాయంలో రెండు శాతం నిధులు పరిశ్రమాధిపతులు కేటాయించాల్సివుంది. రూ.500 కోట్ల నికర విలువ, లేదా వెయ్యి కోట్ల టర్నోవర్, లేదా ఐదు కోట్ల నికర లాభం కలిగిన పరిశ్రమలన్నీ సిఎస్ఆర్ కింద నిధులు కేటాయించాల్సివుంది. అయితే సిఎస్ఆర్ పరిధిలోకి వచ్చే పరిశ్రమల జాబితాయే కమిటీ వద్ద లేకపోవడంతో బతిమలాడి సిఎస్ఆర్ నిధులను రాబట్టి కొన్ని పనులు చేపడుతున్న దుస్థితి కొనసాగుతోంది. స్థానికులు కొందరి నుంచి సమస్యలు రాకుండా కొన్ని పరిశ్రమలు ఆయకట్టులేని చెరువు పనులకు లక్షల రూపాయలు కేటాయించడంతో నిధులు దుర్వినియోగమవుతున్నాయి. కొన్ని సాంకేతిక కారణాలను ఉపయోగించుకొని పరిశ్రమాధిపతులు కలెక్టర్ దృష్టిలో పెట్టకుండా సిఎస్ఆర్ నిధులు కేటాయించడం, ఖర్చు చేయడం జరుగుతోంది. జిల్లాలో 44,935 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేసిన 128 భారీ పరిశ్రమలు, రూ.2,482 కోట్ల విలువైన 18,640 మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఇ) యూనిట్లు వున్నాయి. మొత్తం పరిశ్రమల్లో వివిధ సందర్భాల్లో కొన్ని పరిశ్రమలు కాదనలేక ఈ రెండున్నరేళ్లలో రూ.3.14 కోట్లును వివిధ పనుల నిమిత్తం కేటాయించాయి. ఆ నిధులను పరిశ్రమాధిపతులు తమ దయాదాక్షిణ్యాలపై ఇచ్చినట్లు జిల్లా స్థాయి కమిటీ తెగ సంబరపడుతోంది తప్ప వారి నుంచి నిబంధనల ప్రకారం నిధులు కేటాయించే పనిని సమర్థవంతంగా చేయడంలేదు. కొంతమంది పరిశ్రమాధిపతులు ప్రభుత్వ స్థాయిలో తమ పనులు చేయించుకునేందుకు సిఎం రిలీఫ్ ఫండ్‌కు నిధులు కేటాయించి జిల్లాను విస్మరిస్తున్నారు. సిఎస్ఆర్ నిధులు జిల్లాకు ఎక్కువ కేటాయింపులు జరిగేలా చర్యలు చేపట్టాలని అక్టోబర్ 28న కలెక్టరేట్‌లో రాష్ట్ర ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర నిర్వహించిన సమీక్షా సమావేశంలో కొంతమంది ఎమ్మెల్యేలు వాపోయినా ఫలితం కానరాలేదు.

డబ్బు సంపాదనకే మంత్రి పదవిని వాడుకున్నారు

ముత్తంశెట్టిపై వైసిపి నాయకులు ఆల్ఫా కృష్ణ విమర్శ

మాట్లాడుతున్న ఆల్ఫా కృష్ణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పదవీ వ్యామోహంతో 2019లో వైసిపిలో ముత్తంశెట్టి శ్రీనివాసరావు చేరి పార్టీ తరుపున ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశారని, కీలకమైన పదవులను పొందిన ఆయన భీమిలి నియోజకవర్గం అభివృద్ధికిగానీ, టూరిజం శాఖ మంత్రిగా విశాఖ జిల్లాలో టూరిజం అభివృద్ధికిగానీ ఏమాత్రమూ దోహదపడలేదని, ఆ కాలంలో డబ్బు దోచుకోవడానికే ఎక్కువ సమయం వెచ్చించారని వైసిపి సీనియర్ నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ బిఎస్.కృష్ణ (ఆల్ఫా కృష్ణ) ఆరోపించారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చుని జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు ఇస్తున్నారని, వాటిని దిగువ స్థాయిలో తాము అమలు చేయాలా ? అని ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్మోహన్ రెడ్డి అక్కడ కాకుండా ముత్తంశెట్టి నివసిస్తున్న సీతమ్మధారకు లేదా మంత్రిగా పనిచేసిన భీమిలికి వచ్చి ఆదేశాలు ఇవ్వాలా ? అని ప్రశ్నించారు. మంత్రిగా ఉండి భీమిలి నియోజవర్గంలో వైసిపి ద్వితీయ శ్రేణి నాయకులకు ఎటువంటి నామినేటెడ్ పదవులనూ ఇప్పించలేకపోయారన్నారు.

తన కుమార్తెను కార్పొరేటర్‌గా గెలిపించి, ఆమెకు డిప్యూటీ మేయర్ ఇవ్వాలని, తన కుమారునికి కీలకమైన నామినేటెడ్ పదవి ఇవ్వాలని ముత్తంశెట్టి వైసిపి అధినేతను పలుమార్లు వేడుకున్నారని, ఇది నిజం కాదా ? అని ప్రశ్నించారు. ముచ్చటగా మూడు పార్టీలు మారిన ముత్తంశెట్టి ఇప్పుడు మరోసారి వేరే పార్టీలోకి వెళ్లాలని చూస్తున్నారని, అయితే అటువంటి ఊసరవెల్లి నాయకుడిని ఏ పార్టీ వారూ చేర్చుకోకూడదని అన్నారు. ఆయన మంత్రిగా ఉన్నప్పుడు మహిళల పట్ల వ్యవహరించిన తీరుపై అనేక ఆరోపణలు వచ్చాయన్నారు. భీమిలి ప్రజలకు, విశాఖ జిల్లా ప్రజలకు ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల మరణాలను అరికట్టాలి

ఎస్‌ఎఫ్ఐ మండల మహాసభలో నాయకుల డిమాండ్

చింతపల్లిలో అభివాదం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - చింతపల్లి : గిరిజన ఆశ్రమ హాస్టల్లో మౌలిక సమస్యలు పరిష్కరించి, విద్యార్థుల మరణాలను అరికట్టాలని మాజీ ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ డిమాండ్ చేశారు. శనివారం చింతపల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన భారత విద్యార్థి ఫెడరేషన్ మండల మహాసభ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన గిరిజన ఆశ్రమ వసతి గృహాల్లోని సమస్యలపై మాట్లాడారు. వసతి గృహాల్లోని పోషకాహార లోపంతో లేదా పర్యవేక్షణ అధికారి నిర్లక్ష్యంతో అకాల మరణాలు చెందారని ఇది విచారకరని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు విద్యకు కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నామని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ వాస్తవంగా విద్యాలయాల్లో పరిస్థితులు దయనీయంగా ఉన్నాయని తెలిపారు.వసతి గృహాల్లో ఆరోగ్య కార్యకర్తలు లేరన్నారు. దీంతో ఏ చిన్న అనారోగ్య పరిస్థితులు నెలకొన్నా కనీసం ప్రథమ చికిత్సకు కూడా నోచుకోకుండా మరణాలు సంభవిస్తున్నాయన్నారు. ఈ విషయమై విద్యార్థి సంఘాలు అనేకమార్లు నిరసనలు ,పోరాటాలు చేసినప్పటికీ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. చాలీచాలని వసతులు, తాగునీటి సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెనూ సక్రమంగా అమలు కాలేదని, దీనికి సంబంధించిన మండల వసతి గృహాల పర్యవేక్షణ అధికారుల లోపం స్పష్టంగా కనబడుతుందని విమర్శించారు. విద్యకు కేటాయించిన బడ్జెట్ నిధులు ఏమైపోతున్నాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో గురుకుల పాఠశాలల్లోని ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య కార్యకర్తలను నియమించాలన్నారు.మెనూ సక్రమంగా అమలయ్యేలా చూడాలన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ అల్లూరి జిల్లా కార్యదర్శి పాంగి జీవన్ కృష్ణ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. మండల కార్యదర్శిగా పాంగి సంతోష్, అధ్యక్షులుగా కొర్ర రాజు, ఎస్ఎఫ్ఐ మహిళా కన్వీనర్‌గా కె నిర్మల, 15 మంది మండల కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గం ఎన్నిక

ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా అధ్యక్షుడు శ్రీను ఆధ్వర్యంలో శనివారం నూతన మండల కార్యవర్గం ఎన్నిక జరిగింది. మండల అధ్యక్షుడిగా దిలీప్, కార్యదర్శిగా బాలమ్మను, జాయింట్ సెక్రటరీగా మంజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా ప్రశాంతి, జయంతి, అంజలి, జ్యోతి, అమృత, వసంతకుమారిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు కార్తీక్ మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన మండల కార్యవర్గం విద్యార్థుల సమస్యలపై పోరాడాలన్నారు. అల్లూరి జిల్లాలో సుమారుగా 18 మంది విద్యార్థులు మృతి చెందినా అధికారులు విచారణ చేపట్టడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని చెప్పారు. హెల్త్ వాలంటీర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీను, జిల్లా కమిటీ సభ్యుడు గణేష్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాగేశ్వరరావు

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దేశ అత్యున్నత న్యాయ స్థానం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌ల ద్వారా బాధితులకు సత్వర న్యాయం లభిస్తుందని, ఇలాంటి వేదికలను కక్షిదారులు తప్పక సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కోర్టు ఇన్‌ఛార్జి ప్రధాన న్యాయమూర్తి, నాలుగో అదనపు సెషన్స్ జడ్జి ఎం.నాగేశ్వరరావు అన్నారు. బాధితులకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకుగాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిత్యం పని చేస్తోందని గుర్తు చేశారు. జాతీయ లోక్ అదాలత్ ప్రారంభోత్సవ కార్యక్రమం స్థానిక కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాసదన్ వద్ద శనివారం ఉదయం జరిగింది. జిల్లా కోర్టు ఇన్‌ఛార్జి ప్రధాన న్యాయమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలన్నదే న్యాయ వ్యవస్థ అంతిమ లక్ష్యమని, ఆ దిశగా న్యాయమూర్తులు సేవలందిస్తున్నారని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ బాధితులకు అండగా నిలుస్తూ న్యాయ సహాయం అందిస్తోందని గుర్తు చేశారు. లోక్ అదాలత్ లాంటి వేదికల్లో పౌర శిక్షాస్మృతి, నేర శిక్షాస్మృతి పరిధిలోని రాజీకాగలిగిన కేసులు, మోటారు ప్రమాదాల కేసులు, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు పరిష్కారానికి వస్తాయన్నారు. ప్రభుత్వ సంస్థలు, బీమా కంపెనీలు, బ్యాంకులు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు, కక్షిదారులు ఇలాంటి వేదికలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా హితవు పలికారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవి.శేషమ్మ, శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ జి.వల్లభ నాయుడు, ఫ్యామిలీ కోర్టు జడ్జి కె.రాధారత్నం, బార్ అసోసియేషన్ కార్యదర్శి డి.నరేష్ కుమార్, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు అధికారులు పాల్గొన్నారు.

అనకాపల్లి : జిల్లా కోర్టులో శనివారం మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. పదో అదనపు జిల్లా జడ్జి శ్రీవిద్య ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నపాటి తగువులతో బంధువులు కోర్టులకు ఎక్కి ఆర్థికంగా ఇబ్బంది పడే సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. ప్రధానంగా ఆస్తుల విషయంలో కోర్టు మెట్లెక్కి కాలాన్ని వృథా చేసుకుంటున్నారన్నారు. అలాంటివారు సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌ను ఆశ్రయిస్తే సమస్యను సులువుగా పరిష్కరించుకోవచ్చని సూచించారు. సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ధర్మారావు, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి, అధ్యక్షులు ఎంజెవిఎన్.కుమార్, కార్యదర్శి దుర్గారావు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో కక్షిదారులు హాజరయ్యారు.

స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే హక్కు మోడీకి లేదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే హక్కు ప్రధాని మోడీకి లేదని సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 1356వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ నాయకులు, కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఆవిర్భావ చరిత్రను తెలియజేశారు. కేవలం రూ.4 వేల కోట్ల పెట్టుబడితో ఏర్పడిన ప్లాంట్ దినదినాభివృద్ధి చెందుతూ వచ్చిందన్నారు. పన్నులు, డివిడెండ్ల రూపంలో రూ.50 వేల కోట్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించిందన్నారు. ఉక్కు పరిశ్రమ త్యాగాలతో ఏర్పడిందని, ప్రజల ఆస్తి అని తెలిపారు. దాన్ని అమ్మే హక్కు కేంద్రానికి లేదన్నారు. తక్షణమే ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సంతోష్ కుమార్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ వల్లే విశాఖ నగరం ఇంతలా అభివృద్ధి చెందిందన్నారు.

వ్యాపార రాజకీయాలు !

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అవునన్నా, కాదన్నా ప్రధాన పార్టీల నాయకులకు రాజకీయాలు వ్యాపార విస్తృతికి సాధనాలుగా వున్నాయి. రాజకీయ వ్యాపారం చేసేవారిని, వ్యాపారం కోసం రాజకీయాలు చేసేవారిని ఎన్నికల్లో ప్రజలు దూరం పెట్టనంతకాలం, పక్కకు నెట్టనంతకాలం, ఇంకా చెప్పాలంటే బుద్ధిచెప్పనంతకాలం వారు సిగ్గు వదిలి రాజకీయాలు చేస్తూనేవుంటారు. నైతికంగా దిగజారిపోతున్న విషయం విస్మరించి, కొత్త రాజకీయాలకు వారసులుగా చెప్పుకుంటుంటారు. తాను పార్టీ మారడానికి, వేరొక కండువా భుజాన వేసుకోవడానికి వీరికి క్షణాల్లో బలమైన కారణాలు దొరికిపోతాయి. వ్యాపారాల కోసమని, స్వీయ లబ్ధి కోసమని సిగ్గు విడిచి చెప్పుకోలేక, ఏ పార్టీ మారినా తాము ప్రజల కోసమేనని నొక్కిచెబుతారు. తన వ్యాపార భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఏ పార్టీలో వుండాలి ? ఏ పార్టీలోకి వెళ్లాలి ? అనేది ఎన్నికలకు ముందు, తరువాత రాజీనామా చేయడం, పార్టీ మారడం ప్రధాన రాజకీయ పార్టీ నాయకులకు ఒక అలవాటు. సేవాభావం, సైద్ధాంతిక నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు పార్టీలే అందుకు మినహాయింపు.

అవంతి విద్యా సంస్థల అధినేత, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు తాజాగా వైసిపికి రాజీనామా చేసినట్లు ప్రకటించడం ఆశ్చర్యమేమీలేదు. విద్యా వ్యాపారం చేసిన ఆయన తొలి రాజకీయ ప్రవేశం ప్రజారాజ్యంతో ప్రారంభమైంది. ఆ పార్టీ కాంగ్రెస్‌లో విలీనమైన తరువాత కొంత కాలం అందులో కొనసాగి, తరువాత టిడిపిలో చేరారు. అందులో కొనసాగడం లాభం లేదనుకొని వైసిపిలో చేరి మంత్రి పదవి అనుభవించారు. ఇప్పుడు అధికారంలేని వైసిపిని వీడారు. వేరొక పార్టీలో రేపో, మాపో చేరడమూ ఖాయం. రాజకీయ ప్రవేశం నుంచి ఇప్పటి వరకు ఆయన ఏ పార్టీలోనూ స్థిరంగాలేరు. రేపు వెళ్లిన పార్టీలో వుంటారనీ లేదు. వ్యాపారం చేసుకొని నాలుగు పైసలు కూడబెట్టుకోవడం తెలిసిన వారు మరింత వేగంగా ఎదగడానికి రాజకీయాలను ఒక అస్త్రంగా ఉపయోగించుకోవడం కనబడుతూనేవుంది. ఒకరు విద్య వ్యాపారం, మరొకరు స్థిరాస్థి వ్యాపారం, ఇంకొకరు మద్యం వ్యాపారం, వేరొకరు షిప్పింగ్ వ్యాపారం, గ్రానైట్ వ్యాపారం, కాంట్రాక్టర్లు ఇలా వారివారి నైపుణ్యాలతో సంపాదించుకోవడానికి రాజకీయ ప్రవేశం చేస్తున్నారుగానీ ప్రజల మేలు, బాగుకోరి కాదు.

విద్యుత్ బిల్లులపై నోరు మెదపరు

వీరు ప్రజల బాగుకోరే వారైతే ఎప్పుడో వాడిన విద్యుత్‌కు ఇప్పుడు సర్దుబాటు ఛార్జీలు వసూలు చేయడమేంటని అడిగేవారు. వినియోగదారులపై భారం వేయడం తగదని మాట్లాడేవారు. గతంలో వైసిపి ప్రభుత్వం సర్దుబాటు ఛార్జీలు వసూలుచేసినట్లే, ఇప్పుడు కూటమి ప్రభుత్వం సర్దుబాటు ఛార్జీలు వేసి వసూలు చేస్తోంది. సిపిఎం, వామపక్షాలు మినహా సర్దుబాటు ఛార్జీలు రద్దుచేయాలని ఇతర పార్టీలేవీ మాట్లాడ్డంలేదు. వైసిపి ప్రభుత్వంలో సర్దుబాటు ఛార్జీలు వ్యతిరేకించిన టిడిపి, జనసేన, బిజెపిలు సర్దుబాటు ఛార్జీలు వేసి కరెంట్ బిల్లులను ముక్కు పిండి వసూలు చేస్తున్నాయి.

విశాఖ డెయిరీ యాజమాన్యం తగ్గించిన ఆవు పాల ధర మూడు రూపాయలను పునరుద్ధరించి పాల రైతుకు చెల్లించేలా ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోవడంలేదు. నష్టపోయిన పాల రైతులు పాత ధర చెల్లించాలని ఆందోళన కొనసాగిస్తున్నారు. టిడిఆర్ కుంభకోణంపై విచారణకు కమిటీ ఏర్పాటుపై జివిఎంసి కౌన్సిల్ ఆమోదం వెనుక సిపిఎం, సిపిఐ, ఇతర కార్పొరేటర్ల కృషి వుంది. కుంభకోణం బహిర్గతం చేయడానికి వారు గట్టిపట్టు పట్టబట్టే ఇది సాధ్యమైంది. కౌన్సిల్‌లో వామపక్ష కార్పొరేటర్లు ఉండబట్టే విచారణ స్థాయికి వెళ్లగలిగింది.

విద్యార్థులకిచ్చిన హామీలను నెరవేర్చాలి

ప్రజాశక్తి - యలమంచిలి : గత ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కూటమి ప్రభుత్వాన్ని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్ డిమాండ్ చేశారు. పట్టణంలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ మూడో జిల్లా మహాసభలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో విద్యారంగ సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ యువగళం సందర్భంగా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

పలు అంశాలపై తీర్మానాలు

విద్యా దీవెన, విద్యా వసతి, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని, సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, అనకాపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనాలు సమకూర్చాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని మహాసభలో తీర్మానాలు చేశారు.

జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా బాలాజీ, రమణ ఎన్నిక

ఎస్ఎఫ్ఐ అనకాపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం.బాలాజీ, ఎం.రమణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా గౌతం కుమార్, సహాయ కార్యదర్శులుగా ఎ.అభి, పి.కృపానంద్, జిల్లా కమిటీ సభ్యులుగా జనార్ధన్, విజయ్, నూకరాజు, వెంకటి, నాగేష్‌లు ఎన్నికయ్యారు. 150 మంది ప్రతినిధులు ఈ మహాసభకు తరలివచ్చారు.

ఫిబ్రవరి 22న సామూహిక వివాహాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ పాత నగరం వుడ్ యార్డ్ స్ట్రీట్‌లోగల శ్రీ వాసవీ కల్యాణ మండప సంఘం వారి అధ్వర్యంలో ఫిబ్రవరి 22న ఉచిత సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నట్లు కల్యాణ మండప సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విన్నకోట రామమూర్తి, కందుల మూర్తి తెలిపారు. శనివారం సామూహిక ఉచిత వివాహాలకు సంబంధించిన పోస్టర్‌ను, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత సామూహిక వివాహాల్లో రాష్ట్రంలో ఏ ప్రాంతంలో నివసిస్తున్న వారైననూ నిరుపేద ఆర్యవైశ్య కుటుంబాల్లో యువతీ యువకులకు వారి వారి కుటుంబాల్లో పెద్దల అభీష్టం మేరకు ఈ సామూహిక వివాహాలు జరుపుతామన్నారు.

నగరంలో ఎన్‌టిఆర్ సినీ నట వజ్రోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో శనివారం ఎన్‌టిఆర్ సినీ నట వజ్రోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజెఎఫ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ముందుగా ఫిలిం ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ మెంబర్స్ జ్యోతి ప్రజ్వలనతో, మొదలుపెట్టి విశ్వ విఖ్యాత నట సార్వభౌమ ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ విశాఖ జిల్లా కో-ఆర్డినేటర్‌గా పూతి వెంకటరెడ్డికి బాధ్యతలు అప్పగించి, ఫిల్మ్ ఫిలిం ఛాంబర్ సభ్యులు ఆయనను సత్కరించారు. అనంతరం పూతి వెంకటరెడ్డి మాట్లాడుతూ మద్రాసులో తెలుగు సినిమా పరిశ్రమ ఉన్న తొలినాళ్లలో నందమూరి తారక రామారావు మనదేశం సినిమాలో ఒక చిన్న బ్రిటిష్ పోలీసు పాత్రతో నటుడిగా తెలుగు సినీ రంగప్రవేశం చేసి, ఆ తర్వాత తన నటనా ప్రతిభతో ఎన్నో రకాల పాత్రలు పోషించి, ఆ పాత్రలు ఆయన తప్ప వేరే ఎవ్వరూ పోషించలేరు అని నిరూపించుకొని ప్రపంచ ఖ్యాతి గడించారన్నారు. మనదేశం సినిమా విడుదలై నేటికి 75 సంవత్సరాలు దాటిన సందర్భంగా అలాంటి మహానుభావుని గొప్పతనాన్ని స్మరించుకునేందుకు ఎన్‌టిఆర్ లిటరేచర్ కమిటీ ఛైర్మన్ టిడి.జనార్దన్ పిలుపు మేరకు ఈ సినీ వజ్రోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టు సంఘం కార్యదర్శి, గంట్ల శ్రీనుబాబు, ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ఎపిబిజెఎ అధ్యక్షులు ఈరోతి ఈశ్వరరావు, ఎన్ఎస్.మూర్తి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎండి.బాషా, ఉపాధ్యక్షులు, సత్యనారాయణ రాజు, అల్లూరి జిల్లా కో- ఆర్డినేటర్ శ్రీనివాస్, అనకాపల్లి కో - ఆర్డినేటర్, పివి.మూర్తి పాల్గొన్నారు.

'సెయింట్ ఆంథోనీ' పూర్వ విద్యార్థుల సందడి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలోని మహారాణిపేటలో గుర్తింపు పొందిన సెయింట్ ఆంథోనీ పాఠశాల ఆవరణలో శనివారం పూర్వ విద్యార్థులు సందడి చేశారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన 1984 బ్యాచ్ విద్యార్థులు రెండు రోజుల పాటు ఉత్సవాలు జరుపుతున్నారు. శనివారం ఉదయం 40 ఏళ్ల స్నేహం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రచురించిన సావనీర్‌ను పూర్వ ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు డివి.చలం మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో గడిచిన రెండు దశాబ్దాలలో చేపట్టిన వివిధ కార్యక్రమాలను వివరించారు. పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు కె.చంద్రశేఖరం, రాధాప్రసాదరావు, మరియాదాస్, జోజిబాబు, డి.కొండలరావు, ప్రసాదరావు తదితరులు మాట్లాడారు. అనంతరం పాఠశాల ఆవరణలో నాలుగు సెక్షన్ల విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎస్.శివ శంకర్, కె.గురునాథరావు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ పరిశీలనకు..
17, 18 తేదీల్లో ఏకసభ్య కమిషన్ రాక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలోని ఎస్‌సి వర్గీకరణను పరిశీలించేందుకు నియమించబడిన ఏక సభ్య కమిషన్ బృందం ఈ నెల 17, 18 తేదీల్లో విశాఖపట్నం జిల్లాలో పర్యటించనుందని, జిల్లా యంత్రాంగంతో పాటు వివిధ ఉప కులాల సభ్యుల సంఘాలతో సమావేశమై వినతి పత్రాలు స్వీకరించనుందని విశాఖపట్నం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కమిషన్ సభ్యులుగా విశ్రాంత ఐఎఎస్ అధికారి రాజీవ్ రంజాన్ మిశ్రాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా నియమించిందని పేర్కొన్నారు. ఈ ఏకసభ్య కమిషన్ జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు సంబంధించిన వ్యక్తులు, సంఘాలు, సంస్థల నుంచి వినతి పత్రాలు స్వీకరించి, పరిశీలన చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుందని వెల్లడించారు. అంతేకాకుండా రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో, విద్యాసంస్థల్లో, షెడ్యూల్ కులాల ఉపవర్గాల ప్రాతినిధ్యం, షెడ్యూల్ కులాలలోని వివిధ వర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ విద్యాపరంగా ఉన్న వెనుకబాటును పరిశీలించనుందని తెలిపారు. ఈ క్రమంలో కమిషన్‌కు సమస్యలను నివేదించే వ్యక్తులు లేదా సంస్థలు తమ వినతి పత్రాలను సంబంధిత ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో డిసెంబర్ 18 ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటలలోపు కలెక్టర్ కార్యాలయంలో అందజేసేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు.

61 ఫోన్లు అందజేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రైల్వే ప్రయాణికులు పలు సందర్భాల్లో కోల్పోయిన 61 ఫోన్లను సదరు బాధితులకు గవర్నమెంట్ రైల్వే పోలీస్ విభాగం సిఐ సిహెచ్ ధనుంజయ నాయుడు ఆధ్వర్యాన శనివారం అందజేశారు. ఈ కార్యక్రమం విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లోని ప్లాట్ ఫాం నెంబర్ 1లో ఉన్న రైల్వే పోలీస్ కార్యాలయంలో జరిగింది.